www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 13 డిసెంబర్ 2025

5

ఏలూరు

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

2026-27 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి పరీక్ష ఈ నెల 13వ తేదీ శనివారం నిర్వహించనున్నట్లు డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. జిల్లాలో 11 పరీక్షా కేంద్రాల్లో శనివారం ఉదయం 11.30 గంటల నుండి 1.30 గంటల వరకూ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ అడ్మిట్ కార్డులను వెబ్‌సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా హాల్‌టిక్కెట్‌తో ఉదయం 10 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, 11:30 గంటల తర్వాత ఎవరినీ అనుమతించబోమని పేర్కొన్నారు. విద్యార్థులు వారికిచ్చిన ఒఎంఆర్ షీట్ వారిదో, కాదో సరిచూసుకోవాలని, అందులో వారి సంతకం కోసం కేటాయించిన ప్రదేశంలో సంతకం చేయాలని, బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్‌తో మాత్రమే బబుల్ చేయాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని..
కదంతొక్కిన అంగన్‌వాడీలు

డిఆర్‌ఒకు వినతి అందిస్తున్న నేతలు, అంగన్వాడీలు

అంగన్వాడీల భారీ ప్రదర్శన

కలెక్టరేట్ వరకూ భారీ ప్రదర్శన, మహాధర్నా
తరలొచ్చిన వందలాది మంది అంగన్వాడీలు
డిఆర్‌ఒకు వినతి అందజేత

ప్రజాశక్తి - ఏలూరుఅర్బన్

అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద మహాధర్నా చేపట్టారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చేపట్టిన ధర్నాలో జిల్లా నలుమూలల నుండి వందలాది మంది అంగన్వాడీలు తరలొచ్చారు. తొలుత ఏలూరు జ్యూట్‌మిల్లు సెంటర్ నుండి ప్రారంభమై ఓవర్‌బ్రిడ్జి, ఫైర్‌స్టేషన్ సెంటర్, జిల్లా పరిషత్ సెంటర్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. 'ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, యాప్‌లన్నీ కలిపి ఒకే యాప్‌గా మార్చాలని, మెనూ ఛార్జీలు పెంచాలని' పెద్దపెట్టున నినదించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.భారతి అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా అంగన్వాడీలకు ఒక రూపాయి కూడా వేతనం పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువులు ధరలు ఆకాశాన్నంటుతున్నా వేతనాలు మాత్రం పెంచడం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు అంగన్వాడీల సమ్మె సందర్భంగా ఎన్నో వాగ్దానాలు చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి 18 మాసాలు పూర్తయినా వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. యాప్‌ల పేరుతో అంగన్వాడీలపై పని భారాన్ని పెంచారన్నారు. యాప్‌లన్నీ కలిపి ఒకే యాప్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. గత సమ్మె కాలంలో కూటమి నేతలు సమ్మె శిబిరాల వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఏరు దాటిన తర్వాత బోడి మల్లన్న చందంగా మాట తప్పారని అన్నారు. ఎన్నికల ముందు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను మినిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మిగిలిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చు చేయాలని విజ్ఞప్తి చేశారు. వేతనంతో కూడిన మెటర్నటీ సెలవులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి టి.మాణిక్యం మాట్లాడుతూ అంగన్వాడీలకు మే నెల పూర్తిగా వేసవి సెలవులు ఇవ్వాలని, రెండో శనివారం సెలవు ఇస్తామని కమిషనర్ చేసిన వాగ్దానాన్ని అమలు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎఫ్‌ఆర్ఎస్ పేరుతో అంగన్వాడీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఎఫ్‌ఆర్ఎస్ రద్దు చేయాలని కోరారు. అనంతరం డిఆర్ఒ విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాకు జిల్లా నాయకులు ఎం.తులసి, టి.రజిని, షమీమా, భార్గవి, విమల, చెల్లమ్మ, పుష్ప, లత, బిజెఎన్.కుమారి, సరళ, ఆదిలక్ష్మి, స్వర్ణకుమారి, సిఐటియు నాయకులు ఎం.ఇస్సాక్, వైఎస్.కనకారావు, జి.రాజు, జి.గోపి, జాన్‌బాబు, కుమార్ తదితరులు నాయకత్వం వహించారు.

సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి పార్థసారధి

సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ మంచి వేదిక అని, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి స్వయంగా అర్జీలను స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులతో పరిష్కరింపజేయించారు. దీర్ఘకాలిక సమస్యలను సంబంధిత అధికారులు తక్షణం పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ప్రజాదర్బార్‌లో 180 అర్జీలు రాగా అందులో ఎక్కువ శాతం సామాజిక పింఛన్లకు సంబంధించినవి ఉన్నాయి. మిగిలినవి ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం, రెవెన్యూ సమస్యలకు చెందిన అర్జీలు. కార్యక్రమంలో తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్, ఎంపిడిఒ బి.భార్గవి, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయిని, డిప్యూటీ వార్డెన్ సస్పెండ్

జీలుగుమిల్లి: మండలంలోని అంకన్నగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని గర్భం దాల్చిన విషయంపై ప్రధానోపాధ్యాయిని బి.గంగారత్నం, డిప్యూటీ వార్డెన్ కె.జోగాయమ్మను విధుల నుంచి తొలగించినట్లు ఐటిడిఎ పిఒ కె.రామునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు నెలలుగా పాఠశాలలో ఓ విద్యార్థిని గర్భిణిగా ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇరువురిని విధుల నుండి తొలగించామని పిఒ పేర్కొన్నారు.



వినతి అందిస్తున్న నేతలు

'పోలవరం'ను పోలవరం జిల్లాలో కలపాలి

జెఎసి ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రంపచోడవరం కేంద్రంగా పోలవరం పేరుతో ఏర్పడే జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలని సిపిఎం మండల నేత సిరిబత్తుల సీతారామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పి.అంకంపాలెం సచివాలయం వద్ద జెఎసి ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం, గోపాలపురం మండలంలోని నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను కలపాలని కోరారు. అనంతరం పంచాయతీ అభివృద్ధి అధికారి కృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచి బుద్ధా జగ్గారావు, నాయకులు పేరుబోయిన నాగేశ్వరరావు, మాజీ సర్పంచి వనముల లక్ష్మయ్య, శివకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు రామసింగవరం విద్యార్థిని

ప్రజాశక్తి - కామవరపుకోట

రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు ద్వారకాతిరుమల మండలం రామసింగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎంపికైనట్లు అథ్లెటిక్స్ జిల్లా అధ్యక్షులు జి.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కామవరపుకోటలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో రామసింగవరం పాఠశాల విద్యార్థులు సూదగాని హేమ సత్య విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు, సందీప్, ఆవల నిర్మల పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందుకున్నట్లు ఆయన తెలిపారు. వీరు ఈనెల 24వ తేదీన తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం లో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు నార్ని నాగవసంతరావును, విద్యార్థులను, ప్రధానోపాధ్యాయులు ఆలూరి వెంకటరత్నం, సీనియర్ అథ్లెటిక్స్ మల్ల రాజు, సిబ్బంది అభినందించారు.

కానిస్టేబుళ్లకు ఉత్తమ తర్ఫీదునివ్వాలి : ఎఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

2024 బ్యాచ్‌కు చెందిన సివిల్ ఎఆర్ పోలీస్ కానిస్టేబుల్ ట్రైనింగ్ ప్రక్రియలో భాగంగా వారికి ఉత్తమమైన తర్ఫీదు ఇచ్చి మంచి పోలీసులుగా తీర్చిదిద్దాలని ఎఎస్‌పి నక్క సూర్యచంద్రరావు సూచించారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో కొత్త పోలీస్ రిక్రూట్మెంట్‌లో ఎంపికైన కానిస్టేబుల్‌ల తర్ఫీదు అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఆయన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కానిస్టేబుల్ లకు ట్రైనింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. నూతనంగా అమలయ్యే బిఎన్ఎస్ చట్టాలపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా కేసులను పరిష్కరించడం కూడా వారికి నేర్పించాలని సూచించారు. ఏలూరు డిటిసి డిఎస్‌పి ప్రసాద్, డిటిసి సిఐ ఆకుల రఘు రామారావు, ఆర్ఐ కృష్ణంరాజు, డిటిసి ఎస్ఐలు శంకర్ విజయ్ కుమార్, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల సదనంలోని చిన్నారి దత్తత

ప్రజాశక్తి - ఏలూరు

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో నిర్వహిస్తున్న బాలసదనం, శిశు గృహాల ద్వారా ఆశ్రయం పొందుతున్న బాలలను చట్టపరంగా దత్తత ఇవ్వటం జరుగుతుంది. అందులో భాగంగా శుక్రవారం బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న బేబీ భవాని అను ఏడు సంవత్సరాల బాలికను తమిళనాడు రాష్ట్రానికి చెందిన దివ్యాంగంగం, పద్మావతి దంపతులకు చట్టబద్ధమైన కేరింగ్స్ పోర్టల్ ద్వారా అందజేశారు. అదేవిధంగా శిశు గృహంలో ఆశ్రయం పొందుతున్న బేబీ మోక్షజ్ఞ అను ఎనిమిది నెలల పాపను చెన్నై తమిళనాడుకు చెందిన సెందిల్ బిఆర్, భానుప్రియ ఎస్ అను దంపతులు కలెక్టర్ చేతుల మీదుగా దత్తత తీసుకొన్నారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి, సస్ సంక్షేమ శాఖ సాధికారత అధికారి శారద, జిల్లా బాలల సంరక్షణ అధికారి సిహెచ్.సూర్యచక్ర వేణి, శిశు గృహ మేనేజర్ భార్గవి పాల్గొన్నారు.

తిరుపతిలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభకు హాజరైన ఏలూరు జిల్లాకు చెందిన ప్రతినిధులు

సందడి.. సందడిగా..

నృత్య ప్రదర్శన

హేలాపురి బాలోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బాలబాలికల కేరింతలు, నృత్య ప్రదర్శనలు, విచిత్ర వేషధారణలు, మ్యాజిక్ షోలు, పద్యాలు, జానపద నృత్యాలతో హేలాపురి బాలోత్సవం ఆరో బాలోత్సవం శుక్రవారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ విద్యాసంస్థల ఆవరణలో డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు ప్రాంగణంలో బాలోత్సవం సందడి వాతావరణం నెలకొంది. తొలుత జాతీయ జెండాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుమంటి కోటేశ్వరరావు ఆవిష్కరించారు. బాలోత్సవ పతాకాన్ని ఇటీవల డిఎస్‌సి ఫలితాల్లో 5 సబ్జెక్టులో ఉద్యోగాలు సాధించిన వేలేరుపాడుకు చెందిన నాగుల మంగరాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రారంభ సభలో సిఆర్‌రెడ్డి విద్యాసంస్థల విద్యార్థులు చేసిన రోప్ స్కిప్పింగ్ అందరినీ ఆకట్టుకుంది. బాలల వేషధారణలు, విన్యాసాలు, కళలు, సాంస్కృతిక వైభవం, కోలాటాలు, దేశ స్వాతంత్ర ఉద్యమ నాయకుల వేషధారణలతో ఆ ప్రాంగణమంతా ఆహ్లాదకరంగా మారింది. వ్యాసరచన, పద్యం భావం, సందేశాత్మక గీతాలాపన, ఏకపాత్రాభినయం, లఘునాటిక, అంతర్జాలంలో అన్వేషణ, వాయిద్య పరికరాలతో విన్యాసం, సందేశాత్మక గీతాలు, నృత్యం, జానపద గీతాలు వంటి అంశాల్లో విద్యార్థుల ప్రదర్శనలు అవిుతంగా ఆకట్టుకున్నాయి. ప్రారంభ సభలో యల్లాప్రగడ సుబ్బారావు చిత్రాలను, సృజనాత్మకతను, వివిధ కళలను వెలికి తీసే పెద్ద వేదికను కల్పించినందుకు గర్వపడుతున్నామన్నారు. పెదపాడు ఎంఇఒ ఎస్.నరసింహమూర్తి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో అన్ని పోటీల్లో పాల్గొనడం విద్యార్థులకు అవసరమన్నారు. బాలోత్సవం అటువంటి పోటీలకు వేదికగా ఉందన్నారు. సభలో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మోరాళ మహేష్, డిఎస్‌సిలో ఐదు ఉద్యోగాలు సాధించిన నాగుల మంగరాణికి నిర్వాహకులు జ్ఞాపిక ఇచ్చి సత్కరించారు. మొదటి రోజు 350 పాఠశాలల నుండి ఎనిమిది వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. 53 అకాడమీ, కల్చరల్ విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ విద్యాసంస్థల ఛైర్మన్ కోనేరు సురేష్‌బాబు, నిర్వాహకులు విజిఎంఆర్.కృష్ణారావు, మహమ్మద్ ఆలీ, ఎంఎస్.కాంతారావు, హేలాపురి కళాకారుల సంఘం అధ్యక్షులు పెదపాటి రామకృష్ణ, బాలోత్సవం ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, మేతర అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఆలపాటి నాగేశ్వరరావు

కోలాట ప్రదర్శన

విద్యార్థినుల రోప్ స్కిప్పింగ్

దళితులకు న్యాయం చేయండి

కెవిపిఎస్ ఆధ్వర్యాన డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి

తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న ఫ్రాన్సిస్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని రెడ్డి గణపవరం పంచాయతీ వీరభద్రపురం దళితుల సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 40 సంవత్సరాలుగా ఎస్సీ దళిత పేటకు ఆనుకొని ఉన్న పుంత చెరువు పోరంబోకు స్థలం వీరభద్రపురం దళితులు శ్మశాన స్థలంగా వాడుకుంటున్నారన్నారు. కొల్లూరి పద్మరాజు పక్కన ఉన్న స్థలం చెరువు పోరంబోకు శ్మశాన స్థలంకి వెళ్లే రోడ్డుని ఆక్రమించి శ్మశానానికి దారి లేకుండా జెసిపితో పూడ్చేశారని, శ్మశానానికి వెళ్లే దారిని సర్వే చేసి దళిత పేదలకి న్యాయం చేయాలని డిప్యూటీ తహశీల్దార్ పాయం రమేష్‌కి వినతిని అందజేశారు. గతంలో ఈ విషయంపై దళితులు అప్పుడున్న తహశీల్దార్, కలెక్టర్‌కి అర్జీ పెట్టుకోగా బుట్టాయగూడెం తహశీల్దార్ ఆ ప్రాంతానికి వచ్చి దారి వెళ్లేలా క్లీన్ చేయించారన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి గొడవ లేకుండా దళితులు ఆ శ్మశానాన్ని వాడుకుంటున్నారని, మళ్ళీ సమస్య మొదటికి తీసుకొచ్చి శ్మశానం ఆక్రమణ గురి చేస్తున్నారని, సమగ్రంగా దర్యాప్తు చేసి దళిత పేదలకు న్యాయం చేయాలని ఫ్రాన్సిస్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దళితులు ఇంజరుపు రాంబాబు, ఎ.రాజశేఖర్, వి.రవిలింగాల వెంకటేశ్వరరావు, టి.పూర్ణచంద్రరావు, వి.బాబురావు, కొల్లి రామచంద్రం, కొత్తపల్లి రవి రాజు, కొత్తూరి బాబురావు, యడ్లపల్లి దానియేలు పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు : జెసి

ముదినేపల్లి: రైతులు తాము పండించిన ధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు విక్రయించి, ఆర్థికంగా నష్టపోవద్దని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ కోరారు. మండలంలోని దాకరం, పెదపాలపర్రు, ముదినేపల్లి, చినపాలపర్రు గ్రామాల్లో జాతీయ రహదారి వెంబడి తేమ శాతం తగ్గించేందుకు రోడ్ల వెంబడి రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని శుక్రవారం జెసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పెదపాలపారు గ్రామంలోని రైస్ మిల్లును పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మిల్లర్లు సూచించారు. సదరు మిల్లర్ రైతులను ఇబ్బంది పెడుతున్నట్లు వచ్చిన ఆరోపణపై జెసి మిల్లర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బంది పెట్టే చర్యలకు పాల్పడితే బ్లాక్ లిస్టులో రైస్ మిల్లు పెడతానని హెచ్చరించారు. మిల్లులో చిరిగిపోయిన సంచులను పరిశీలించారు. పాడైన సంచులను రైతులు రైతు సేవా కేంద్రాల్లో అప్పగిస్తే అధికారులు మంచి సంచులు ఇస్తారన్నారు. పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు తొందర పడకుండా నాణ్యత ప్రమాణాలకనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. మండలంలోని రైతులకు ధాన్యం కొనుగోలు విషయంలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే మండల తహశీల్దార్‌ను, మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలన్నారు. వాతావరణం అనుకూలంగా ఉన్న కారణంగా రైతులు తొందరపడకుండా ధాన్యాన్ని 17 తేమ శాతం వచ్చే వరకు బాగా ఆరబెట్టుకుని ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ వెంట తహశీల్దార్ లతిప్ పాషా, ఎడిఎ జి.వెంకట మణి, మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్, ఆర్ఐ రాజశేఖర్, విఆర్ఒలు శ్యామ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా తల్లాపురం 'వెట్ మిక్స్' రోడ్డు

వాహనదారుల బెంబేలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు - తల్లాపురం రోడ్డుపై ఐదు నెలల క్రితం వేసిన వెట్ మిక్స్ రోడ్డు(డబ్ల్యుబిఎం) ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు వేసిన కొద్ది రోజులకే కంకర రాళ్లు పైకి తేలి, వాహనదారులు ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు జారిపడి తీవ్ర గాయాల పాలవుతున్నారు. స్థానిక ప్రజలు, వాహనదారులు ఈ నాణ్యతలేని పనులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చేబ్రోలు - తల్లాపురం రోడ్డు దుస్థితి

చేబ్రోలు రైతులు నిత్యం ఈ మార్గం మీదుగానే పొలాలకు వెళ్లాలి. అలాగే తల్లాపురం ప్రజలు నిత్యం చేబ్రోలు రావాలంటే ఇదే ప్రధాన దారి. తల్లపురం రోడ్డు ప్రధాన రహదారి కావడంతో దీనిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఉపాధి హామీ నిధులు రూ.49 లక్షల నిధులను ఎంఎల్ఎ ధర్మరాజు మంజూరు చేయించారు. దాంతో గడచిన జులైలో ఈ రోడ్డు మరమ్మత్తుల నిమిత్తం వెట్ మిక్స్ పద్ధతిలో పనులు చేపట్టారు. దానిపై బిటి రోడ్డు వేయాలి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలను పాటించకపోవడం వల్ల రోడ్డుపై గట్టిపడాల్సిన సిమెంట్, ఇసుక మిశ్రమం ఊడిపోయి పెద్దపెద్ద కంకర రాళ్లు రోడ్డుపై తేలియాడుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

ద్విచక్ర వాహనదారుల అవస్థలు

ఈ రాళ్ల కారణంగా ద్విచక్ర వాహనాలు జారిపడటం సర్వసాధారణంగా మారింది. ఇప్పటికే పలువురు వాహనదారులు జారిపడి గాయాలపాలయ్యారు. రాత్రి సమయాల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు.

ప్రభుత్వ నిధులు వృథా

ప్రజల పన్నుల డబ్బుతో వేసిన రోడ్డు కొద్ది రోజుల్లోనే ప్రమాదకరంగా మారడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత లేని పనుల కారణంగా ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రతిరోజూ ఎవరో ఒకరు కింద పడుతున్నారు. అధికారులు వచ్చి చూస్తే వారికే తెలుస్తుంది ఈ రోడ్డు ఎంత ప్రమాదకరంగా ఉందో. తక్షణమే ఈ రోడ్డును బాగు చేయకపోతే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు వాపోయారు. తల్లపురం రోడ్డును యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేయాలని వాహనదారులు, స్థానికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

రాళ్ల పైకి తేలిన చోట మళ్లీ చదును చేయించి తారు రోడ్డు నిర్మాణ పనులు చేయిస్తామని పంచాయతీ రాజ్ డిఇ వేణుగోపాల్ ప్రజాశక్తికి వివరించారు. కాగా ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారుడు పనులు కొనసాగించలేదని, బిల్లులు త్వరగా విడుదల చేయాలని కోరుతున్నారు.

కోకో గింజల నాణ్యతపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని నర్సంపేట గ్రామంలో రైతులకు కోకోగింజల నాణ్యత ప్రమాణాలు పెంచుటకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీల గురించి ద్వారకాతిరుమల మండల ఉద్యాన శాఖ అధికారి పిబిఎస్.అమర్ నాథ్ అవగాహన కల్పించారు. కోకో గింజలు పులియ పెట్టుటకు ఉపయోగించే చెక్కబళ్ల బాక్సులకు, ప్లాస్టిక్ ట్రేలకు, గింజలు ఎండబెట్టే బరకాలకు ప్రభుత్వం 35 శాతం సబ్సిడీ కల్పిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. అదే విధంగా కోకోగింజలు ఎండబెట్టుటకు సోలార్ డ్రయర్ రూ.14 వేలపై, కోకో ప్యాక్ హౌస్‌లకు రూ.2 లక్షలపై 40 శాతం సబ్సిడీ కలదని తెలిపారు. మరిన్ని వివరాలకు రైతు సేవా కేంద్రాలను గాని, ఉద్యాన అధికారి నెంబర్ 7995086869 ద్వారకాతిరుమల వారిని సంప్రదించవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దొరసానిపాడు గ్రామ రైతులు, రైతు సేవా కేంద్రం సహాయకురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

మామిడిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు

ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.కనక మహాలక్ష్మి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మామిడి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని నూజివీడు మామిడి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.కనకమహాలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బొద్దనపల్లి, ఈదర గ్రామాల్లోని మామిడితోటలను ఆమె ఆగిరిపల్లి ఉద్యానశాఖాధికారిణి ఆర్.హేమతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి పూత ప్రారంభ దశలో వున్నందున మామిడి తోటలను పరిశుభ్రంగా వుంచుకోవడంతో పాటు పోటాష్ 5 గ్రాములు, జింక్, బోరాన్ 2 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. రసం పీల్చే పురుగు అనగా తేనే మంచు కానీ తామర పురుగు గానీ గమనించిన యెడల ఇమిడ్రాక్లోప్రిడ్ 0.3మీ, పిప్రోనిల్ 2 మి.లీ, సాప్ 2 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఉద్యానశాఖాధికారిణి ఆర్.హేమ మాట్లాడుతూ రాయితీపై అందిస్తున్న మామిడి కవర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బొద్దనపల్లి పిఏసిఎస్ చైర్‌పర్సన్ నలజాల హరిబాబు, ఈదర గ్రామ ప్రముఖులు దొండపాటి ఏసుపాదం, పలువురు మామిడి రైతులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి దిశా నిర్ధేశం

మండల విస్తృత స్థాయి సమీక్షలో ఎంఎల్ఎ చింతమనేని

ప్రజాశక్తి - పెదవేగి

మండలంలోని గ్రామాల అభివృద్ధికి ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ దిశా నిర్ధేశం చేశారు. మండలంలోని లక్ష్మీపురం మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో జరిగిన విస్తృతస్థాయి సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులకు, సిబ్బందికి, కూటమి నాయకులకు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి సంక్షేమ పనుల పై కూటమి నాయకులు సంబంధిత అధికారులతో సమీక్షిం గ్రామాల్లో సమస్యలను పరిష్కరించడంతోపాటు సంక్షేమ పథకాల అమలులో ఏర్పడే సాంకేతిక సమస్యలను సైతం స్థానిక సచివాలయాల్లో గ్రీవెన్స్ నమోదు చేయించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సత్వరమే అమలు చేసేందుకు స్థానిక కూటమి నాయకులు, సంబంధిత సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ అంశంలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించమన్నారు. బౌ బౌ అంటూ పిచ్చివాగుడు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని వైసిపి నాయకుడు అబ్బయి చౌదరికి విజయరాయి సొసైటీ అధ్యక్షులు బొప్పన సుధా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీలో గంటల తరబడి మాట్లాడానని గొప్పలు చెప్పే అబ్బయ్య చౌదరి దెందులూరు నియోజకవర్గానికి ఎన్ని పరిశ్రమలు తెచ్చావని నిలదీశారు. వైసిపి నాయకులు చేసే తప్పుడు ప్రచారాలను కూటమి నాయకులు, కార్యకర్తలు సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు త్రోబాల్, క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు డివిజన్ ఉమెన్ త్రో బాల్ పోటీలకు ఆరు మండలాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ బాలుర పాఠశాలలో శుక్రవారం త్రోబాల్ కోర్టును నూజివీడు ఉప విద్యాశాఖాధికారి సుధాకర్, మండల విద్యాశాఖ అధికారి-2 జమలయ్య పాల్గొన్నారు. ఎస్ఆర్ఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని పుష్పలత త్రో బాల్ కోర్టును ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఉప విద్యాశాఖాధికారి, మండల విద్యాశాఖ అధికారి పరిచయం చేసుకున్నారు. మెన్ టీచర్స్ క్రికెట్ విన్నర్స్‌గా చింతలపూడి, రన్నర్స్‌గా ఆగిరిపల్లి, మహిళా టీచర్స్ త్రో బాల్ విన్నర్స్ గా నూజివీడు, రన్నర్స్‌గా చింతలపూడి ఎన్నికైంది. విన్నర్స్‌గా నిలిచిన జట్టు జిల్లా స్థాయిలో పాల్గొంటారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వాకా నాగరాజు రవీంద్ర, ఆలీ ఖాన్, లక్ష్మి, ప్రభాకర్, సుగుణరావు, రాజేంద్రప్రసాద్, ప్రభాకర్, రాణి, సుకుమార్, వెంకటేశ్వర రావు, సరళ, స్వప్న, బాల భాస్కర్, సుహర్షత, అన్నామణి, అలీఖాన్, వనజ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డి దగ్ధం

ప్రజాశక్తి - ముదినేపల్లి

వరిగడ్డి లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగలడంతో వరిగడ్డి దగ్ధమైన సంఘటన శుక్రవారం ముదినేపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళితే ముదినేపల్లికి చెందిన రైతు ఈడే త్రివిక్రమ్ తన చేలోని వరిగడ్డిని ట్రాక్టర్‌పై ఇంటికి తరలిస్తున్నాడు. ఈ క్రమంలో బంటుమిల్లి రోడ్డులోని రాము షెడ్డు వద్ద ట్రాక్టర్‌పై ఉన్న వరిగడ్డి విద్యుత్ తీగలకు తగలడంతో గడ్డికి నిప్పు అంటుకుంది. దీంతో అప్రమత్తమైన ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్ ట్రక్కు పైకి లేపి గడ్డిని అన్‌లోడ్ చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో స్పందించిన స్థానికులు మంటలు అదుపు చేశారు. రూ.10 వేలు విలువైన వరి గడ్డి దగ్ధమైనట్లు రైతు తెలిపారు. ట్రాక్టర్‌కు స్వల్ప నష్టం వాటిల్లింది.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రౌడీషీటర్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండటంతో పాటు, నేర ప్రవృత్తికి స్వస్తి పలికి గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని నూజివీడు గ్రామీణ సిఐ కె.రామకృష్ణ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం శుక్రవారం ఆయన ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్‌తో కలిసి మండలంలో వున్న రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచడం జరుగుతుందని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కోరం లేక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉండగా మండలంలోని 9 మంది ఎంపిటిసి సభ్యులకు గాను ఇద్దరు సభ్యులు మాత్రమే హాజరయ్యారని, సమావేశం నిర్వహించాలంటే కనీసం ఐదుగురు ఎంపిటిసి సభ్యులు హాజరు కావలసి ఉండటంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. కాగా సమావేశాన్ని తిరిగి ఈనెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. అయితే ఇటీవల ఎంపిపిపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దానికి సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి తీర్పు వెలువడకపోవడంతోనే సమావేశానికి హాజరు కాలేదని పలువురు ఎంపిటిసిలు చెబుతున్నారు. అయితే మరలా సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేయడం ద్వారా ఇప్పుడు డుమ్మా కొట్టిన ఎంపిటిసి సభ్యులు అప్పటి సమావేశానికి హాజరవుతారా? రాకపోతే సమావేశం ఎలా నిర్వహిస్తారో అధికారులకే తెలియాల్సి ఉంది.

తలారి వెంకటస్వామికి పరామర్శ

మండవల్లి: రోడ్డు ప్రమాదం జరిగి ప్రాణాలతో బయటపడడం అదృష్టమని మాజీ మంత్రి, పార్లమెంటు మాజీ సభ్యులు మాగంటి వెంకటేశ్వరరావు అన్నారు. కైకలూరు ఎఎంసి మాజీ చైర్మన్ తలారి వెంకటస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన తలారి వెంకటస్వామి నివాసానికి చేరుకుని శుక్రవారం ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తూ రోడ్డు ప్రమాదం జరగడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఇందుకూరి వజ్రం, టిడిపి నేతలు వీరబత్తిన సుధా, టిడిపి రాష్ట్ర యాదవ్ కార్యదర్శి తలారి రాజేష్, గూడపాటి లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

బిసి సెల్ అధ్యక్షులు యాదవ్‌కు పరామర్శ

మండవల్లి: పూర్తి ఆరోగ్యాన్ని పెంపొందించుకొని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, కైకలూరు మాజీ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు కోరారు. బిసి సెల్ అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్ ఇటీవల అస్వస్థత గురవ్వడంతో సమాచారం అందుకున్న ఆయన పలువురు నాయకులతో కలిసి గోకర్ణ యాదవ్ నివాసం చేరుకుని శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి కుటుంబ సభ్యులు, కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వ్యక్తి గోకర్ణ యాదవ్ అన్నారు. అలాంటి వ్యక్తి అనారోగ్యం బారిన పడడం బాధాకరమన్నారు. ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, గుమ్మడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం

మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్

చిట్ - చాట్

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు రైతుసేవా కేంద్రాల ద్వారా సుమారు 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో వివిఎ, డిసిఎంఎస్ ద్వారా టెక్నికల్ అసిస్టెంట్, టెక్నికల్ ఆపరేటర్, సిబ్బందితో ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు అందిస్తున్నామన్నారు. ప్రజాశక్తి చిట్-చాట్‌లో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న : మండలంలో ఎన్ని ఎకరాల్లో సార్వా వరి సాగైంది? వరి పంట ఎన్ని రకాలు?

ఎఒ : 14,500 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగయ్యింది. కామన్ వరి రకాలు ఎంటియు 1318, స్వర్ణ వరి రకాలు పండించారు.

ప్రశ్న : మండలంలో ఎన్ని వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించారు?

ఎఒ : మండలంలో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనే లక్ష్యం నిర్ణయించగా, ఇప్పటి వరకు రైతుసేవా కేంద్రాల ద్వారా సుమారు 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం.

ప్రశ్న : మండలంలో గోనె సంచుల కొరత ఉందా?

ఎఒ : మండలంలో గోనె సంచుల కొరత ఏమీ లేదు.

ప్రశ్న : మొంథా తుపాన్ వల్ల వరి పంటకు నష్టం ఎంతమేరకు వాటిల్లింది?

ఎఒ : మొంథా తుపాన్ వల్ల సుమారు రెండు వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. వరి పంట నష్టం అంచనాలు ప్రభుత్వానికి పంపాం. పంట నష్టపరిహారం సొమ్ము త్వరలో రైతుల ఖాతాల్లో జమవుతుంది.

ప్రశ్న : రబీలో ఏ పంటలు పండిస్తారు?

ఎఒ : ఎక్కువగా మినుము, ఐదు గ్రామాల్లో వేరుశెనగ ఆరుతడి పంటలు పండించనున్నారు.

ప్రశ్న : ఇప్పటి వరకు వరి కోతలు ఎంతమేర పూర్తయ్యాయి?

ఎఒ : 50 శాతం వరకు పూర్తయ్యాయి.

ప్రశ్న : ధాన్యం తేమశాతంలో వ్యత్యాసాలు ఉంటే ఎవరిని సంప్రదించాలి?

ఎఒ : రైతుసేవా కేంద్రానికి, రైస్‌మిల్లు వద్ద తేమ శాతాల మధ్య వ్యత్యాసం ఉంటే 9849903976 నెంబర్‌కు ఫోన్ చేసి తహశీల్దార్‌ను సంప్రదించాలి.

దీక్షదారులకు అల్పాహారం వితరణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆధ్యాత్మిక భావనతో చేసే సేవలే ప్రజల మన్ననలు పొందేందుకు మూలమని జెడ్‌పి చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రి కొండకు కాలినడకన వెళ్లే దీక్షాదారుల సౌకర్యార్థం ఏలూరు పోస్టల్ కాలనీ 7వ రోడ్డు ఎదురుగా మినీ బైపాస్ వద్ద చైర్‌పర్సన్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఒక్కరోజు అల్పాహారం, అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని, ఉచిత వైద్య శిబిరాన్ని ఎంఎల్ఎ బడేటి చంటి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అలాగే వివిధ ప్రాంతాల నుండి కాలినడకన ఏలూరు మీదుగా విజయవాడ వెళ్తున్న భవానీలకు అల్పాహారాన్ని అందించారు. పండ్ల పంపిణీ చేశారు. చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో మేయర్ నూర్జహాన్ పెదబాబు, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, ఘంటా ప్రసాదరావు పాల్గొన్నారు.

లంబాడీపేటలో ఫ్లైడే డ్రై డే

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు పరిధిలోని లంబాడిపేట ప్రాంతంలో శుక్రవారం ఫ్లైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా లీగల్ సెల్ అథారిటీ జిల్లా జడ్జి టి.రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతను కట్టుదిట్టంగా పాటించాలని సూచించారు. పరిశుభ్రతను పాటించడం ద్వారా అంటువ్యాధులు మన దరి చేరకుండా నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. తదుపరి పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ టింపికిల్ మాట్లాడుతూ ప్రజలు పరిసరాల పరిశుభ్రతను అలవాటు చేసుకుంటే డెంగీ, మలేరియా, కామెర్లు, టైఫాయిడ్, అతిసార వంటి అంటు వ్యాధులను పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. వారానికి ఒకరోజు నీటి నిల్వ ప్రాంతాలైన డ్రమ్ములు, నీళ్ల తొట్టెలు, ఎయిర్ కూలర్లు, ఫ్రిజ్ బాక్స్‌లు తప్పనిసరిగా శుభ్రం చేయాలని ఆమె సూచించారు. ప్రజలకు ఫ్లైడే డ్రై డే కార్యక్రమ అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, డెమో బి.శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, లీగల్ కన్సల్టెంట్ వడ్డీ రవి, ల్యాబ్ టెక్నీషియన్ చిట్టిబాబు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి వినతిని అందజేస్తున్న రాష్ట్ర డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాసరాజు

అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - కలిదిండి

అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేసినట్లు అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాసరావు తెలిపారు. అగ్నికుల క్షత్రియులు సామాజికంగా, ఆర్థికంగా, విద్యావరంగా అభివృద్ధి చెందేందుకు కార్పొరేషన్‌కు నిధులు కోరడం జరిగిందన్నారు. అలాగే బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందజేయాలని తెలియచేయడం జరిగిందన్నారు.

నూజివీడులో విజిబుల్ పోలీసింగ్

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలో శుక్రవారం రాత్రి పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. డిఎస్పి కెవివిఎన్వి.ప్రసాద్ మాట్లాడుతూ ఎస్పి ప్రతాప్ శివ కిషోర్ ఆదేశంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో విజిబుల్ పోలీసింగ్ ద్వారా ట్రాఫిక్ అవేర్నెస్, ఫుడ్ పెట్రోలింగ్ నిర్వహించటం ద్వారా ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడమేనన్నారు. పట్టణ సిఐ పి.సత్య శ్రీనివాస్, రూరల్ సిఐ కొప్పిశెట్టి రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేర నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం : ఎస్ఐ

ఆగిరిపల్లి: దేవాలయాల వద్ద నిర్వాహకులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని, నేర నియంత్రణలో సహకరించాలని ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ కోరారు. శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశానుసారం దేవాలయ నిర్వాహకులతో దేవాలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నిరోధించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని, దేవాలయ నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. పలు దేవాలయాల నిర్వాహకులు పాల్గొన్నారు.

కాగుపాడు హైస్కూల్‌లో వ్యక్తిత్వ వికాస తరగతులు

ఉంగుటూరు : కాగుపాడు హై స్కూల్‌లో మానవత ఆధ్వర్యాన కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాశ నిపుణులు తాడేపల్లి మోహన్ రావు పాల్గొని పదవ తరగతి విద్యార్థులకు దిశా నిర్ధేశం చేశారు. ప్రతీ వ్యక్తి మంచి ప్రవర్తన కలిగి ఉండాలని, విలువలు ఆచరించాలని బోధించారు. జాతీయ నాయకుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ఆచరించాలని వివరించారు. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థి జీవితంలో గొప్ప మలుపు అని, ప్రతీ ఒక్కరూ కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలని ఆకాంక్షించారు. అనంతరం పదవతరగతిలో ప్రతిభ చూపుతున్న లండా జ్యోతి ప్రియాంక, లండా రమ్య గీతిక, యాగన శ్రావణిలకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. హెచ్ఎం వెలిచర్ల శ్రీనివాస్ ఉన్నారు.

క్రికెట్ ఫైనల్స్‌కు పెదవేగి ఉపాధ్యాయుల టీమ్

ప్రజాశక్తి - దెందులూరు

ఫైనల్స్‌కు చేరిన టీమ్

ఏలూరు జోన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల క్రికెట్ పోటీల్లో పెదవేగి మండలం టీమ్ సత్తా చాటుతోంది. ప్రత్యర్థి టీమ్‌లను మట్టి కురిపిస్తూ అంతిమ పోరుకు సిద్ధమైంది. శుక్రవారం జరిగిన పోరులో సమీప ప్రత్యర్థి భీమడోలు మండల టీమ్‌పై 8 పరుగుల తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు అర్హత సాధించింది. కెప్టెన్ తాతపూడి ప్రవీణ్ కుమార్ చివరి ఓవర్‌లో 12 పరుగులు చేయవలసి ఉండగా అద్భుతంగా బౌలింగ్ వేసి కేవలం 4 పరుగులు మాత్రమే ఇచ్చి మ్యాచ్‌ను విజయం వైపు తీసుకెళ్లాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫైనల్‌లో కూడా ఇదే స్పిరిట్‌తో ఆడి విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. బ్యాటింగ్ విభాగంలో తాతపూడి ప్రవీణ్ కుమార్, అబ్బదాసరి శ్రీనివాస్, బౌలింగ్ విభాగంలో ప్రవీణ్, శ్రీనివాస్, గుంజు శ్రీనివాస్‌లు, ఫీల్డింగ్‌లో రమేష్, దుర్గారావు అందర్నీ అలరించారు. టీమ్ సభ్యులకు శుభాభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ప్రభాకర్, అరుణ్‌కుమార్, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ అలివేలు, పీడీలు మోర్ల శ్రీనివాస్, నరసింహారాజా, జమ్మా రామకృష్ణ, రఫీ, పరస నాగార్జున, రమేష్ పాల్గొన్నారు.

2కె రన్‌లో ప్రత్యూషకు గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - పోలవరం

గోల్డ్ మెడల్‌తో ప్రత్యూష

కామవరపుకోటలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో గుటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని వీరపరాజు ప్రత్యూష 2 కిలోమీటర్ల రన్‌లో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. చిన్న వయసులోనే అసాధారణ పట్టుదల, క్రీడాస్ఫూర్తి ప్రదర్శించిన ప్రత్యూష విజయం పాఠశాల పేరు మారుమోగేలా చేసిందని ప్రత్యూష సాధించిన ఈ ఘనత పట్ల పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్ ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రతి అడుగులోనూ ప్రోత్సహిస్తున్న శారీరక విద్యా గురువు మధు కిషోర్, పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్ సిహెచ్.అప్పన్నదొర, ఉపాధ్యాయ సిబ్బందంతా ప్రత్యూషకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాలల్లోను, విద్యార్థులు క్రీడల్లో దేశస్థాయి ప్రతిభ కనబరచగలరని ప్రత్యూష మరోసారి నిరూపించిందని ఉపాధ్యాయ వర్గం పేర్కొంది.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపిపి

ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలని ఎంపిపి ఆర్.సత్యనారాయణ అన్నారు. మండలంలోని సింగరాయపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మొంథా తుపాను దాటికి భవనం పైకప్పు నుండి నీరు కారి శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. దీనిపై వెంటనే స్పందించిన ఎంపిపి సత్యనారాయణ శుక్రవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామ సర్పంచి బోయిన విమల రామరాజుని ఆదేశించారు. అనంతరం పాఠశాలను పరిశీలించారు. అక్కడ పనిచేసే ఉపాధ్యాయులను, విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే అక్కడ అమలవుతున్న వివిధ అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచి బోయిన విమల రామరాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటిలో డెవ్ ఫెస్ట్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మాట్లాడుతున్న ఎన్‌పి

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జియుకెటి) నూజివీడు క్యాంపస్‌లో గూగుల్ డెవలపర్ గ్రూప్స్ ఆధ్వర్యాన ఎంటర్‌ప్రైజ్ మైండ్స్ సహకారంతో టెక్ ఇన్నోవేషన్, డెవలపర్స్ సమ్మిట్ - 2025 శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానిక ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏలూరు ఎస్పి కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ పాల్గొని మాట్లాడుతూ 'టెక్నాలజీని పోలీస్ వ్యవస్థలో సమర్థవంతంగా ప్రవేశపెట్టి, దర్యాప్తులను వేగవంతం చేయడంలో ఎఐ వినియోగం, ఆదివాసీ ప్రాంతాల్లో కమ్యూనిటీ నమ్మకం పెంపు, యువతలో భద్రతా అవగాహన పెంపు వంటి తన వినూత్న కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో తన విద్యాభ్యాసం కొనసాగిందని, విద్యార్థులు ర్యాంగింగ్ వంటి వాటిలో పాల్గొని భవిష్యత్తును పాడు చేసుకోవద్దని, మీరు ఉన్నతంగా ఎదగడానికి ఆర్‌జియుకెటి ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని ఉపయోగించుకుని మంచి ఉద్యోగాలు సాధించాలని, సమాజానికి ఉపయోగపడే కొత్త యాప్స్ కనిపెట్టాలని, సమస్యల వెంట పరిగెడితే విజయం సాధిస్తారని తెలిపారు. ఈ సందర్భంలో గూగుల్ డవలపర్స్ గ్రూప్ సంస్థతో ఆర్‌జియుకెటి ఎంఒయు చేసుకుంది. ఈ ఎంఒయు సాంకేతికంగా విద్యార్థులకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఎస్ఎసి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు భారీగా హాజరై తాజా టెక్నాలజీలపై అవగాహన పొందారు. విద్యార్థులు, అధ్యాపకులు, సాంకేతిక రంగంపై ఆసక్తి ఉన్న పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ